ఊరి బావిలోంచి గుక్కెడు మంచినీళ్ళు తీసుకుంటే తన్ని తరిమిన పెద్దమనిషి పేరున తమ వాడలో జెండా అరుగు కట్టిస్తానంటే ధర్మయ్యనే కాదు ఎవరయినా తిరగబడతారు. తమ ఆత్మాభిమానానికి భంగం కలిగించే ఏ చర్యనైనా ప్రతిఘటిస్తారు. ఆత్మగౌరవం కోసం తపించే అణగారిన కులాల కంఠస్వరాన్ని బలంగా వినిపించిన కథ ఇది.

# జెండా అరుగు

షర్మిల




"పెద్దముండావాడన్న గౌరవం ఆళ్లకి ఏ మాత్రం లేదన్న మాట, అసలు చిన్నంతరం పెద్దంతరం వుండక్కర్లా ! పతాడూ నాయకుడ్నే అనుకుంటన్నారు ... చూస్తా! ఎవరేం చేస్తారో" అని ఒకటే ఎగురుతున్నాడు మా పద్దయ్య పెదనాన్న.

"పద్దయ్యబ్బాయి! ఊరుకో నీకసలే రక్తపోటు అరవబాక గుండాపరేషను గూడా చేయించుకున్నావు. ఆయాసం వస్తంది. ఆళ్లు నీ మాట ఇంటే ఎంత ఇనకపోతే ఎంత" అని బతిమాలుతున్నాడు మా పెదనాన్న.

"అది కాదురా! ఆళ్ల కోసం నేను ఎన్ని జేశాను. నే పెసిడెంటుగా వుండగానే స్కూల్ శాంక్షన్ చేయించా, రోడ్డేయించా, ఎలక్షన్లొస్తే ఎంత మేపాను ఛూ ! ఇశ్వాసం అన్నది వుండాలి" మళ్లీ ఆవేశపడిపోయాడు పద్దయ్య పెదనాన్న .

ఈ గొడవంతా మా ఊరి మధ్యలో వున్న పెద్ద వేప చెట్టు కింద కట్టిన అరుగుల మీద జరుగుతాంది. ఆ అరుగు దగ్గర కూర్చుంటే మొత్తం ఊరి విశేషాలన్నీ తెలుస్తాయి. రెండు మూడు పేపర్లు పడివుంటాయి. చదువుకొనే వాళ్ళు చదువుకుంటా వుంటారు. ఒక పక్క ప్రపంచ రాజకీయాల మీద చర్చ జరుగుతూ వుంటే మరో పక్క బడ్జెట్ మీద చర్చ జరుగుతూ వుంటుంది. ఒక్కోసారి అంతా కలిసి ఊళ్లో ఎవరెవరు దివాళా ఎత్తారు, ఎవరెవరు అడ్డంగా సంపాదించారో మాట్టాడుకుంటూ వుంటారు. ఆ అరుగు మీద వుండే పేపర్లలో విశాలాంధ్ర పేపరు మా పద్దయ్య పెదనాన్నదే. ఆయన కమ్యూనిస్టు. ఆయన కమ్యూనిజం గురించి అరటిపండు ఒలిచినంత సులభంగా ఉపన్యాసం ఇవ్వ గలడు. దేముడి మీద నమ్మకం లేదు గానీ మా ఊరి గుడికి చాన్నాళ్లు ఆయనే ధర్మకర్త. మరీ అపోజిషనాళ్లు గోల పెట్టేసరికి వేరే వాళ్లకి వారసత్వం ధారపోసేశాడు.

ఊరంటే మా పద్దయ్య పెదనాన్నకి ప్రాణం. కొడుకులు, కూతుళ్ళు మహానగరాల్లో వుంటున్నా ఆయన ఊరొదిలి మాత్రం ఎల్లడు. అట్టాంటాడు ఇవ్వాళ తన మాట ఇన్లేదని బాధపడతాంటే ఆయన అన్నదమ్ములకి, మిగతా వాళ్లకి కాలూ చెయ్యీ ఆడటల్లా.

చుట్టం చూపుగా ఊరెల్లిన నాకు ఈ గందరగోళం ఏమీ అర్థం కాలా.

"అసలేం జరిగిందిరా" అని బాబు నడిగా. బాబు మా పెదనాన్న కొడుకు.

"ఏం చెప్పమంటావు. మానూళ్లో ఇప్పుడు మన మాటకి ఇలువే లేదు. ప్రెసిడెంట్ సీటు రిజర్వేషన్ కింద మాలాళ్లకి పోయింది. మేవంతా పద్దయ్య పెదనాన్న చెప్పాడని ఆయన నుంచో బెట్టినాడు గెలవాలని కిందా మీదా పడ్డాం. తీరా ఆడు గెలిచిన తరువాత మన్ని పట్టించుకోటల్లా ఆళ్లూ ఆళ్లూ ఒకటయ్యారు. అంతెందుకు ఆళ్లకెంత ఘరాణా అనుకున్నా, గొడ్లని కాయటానికి ఈ మధ్య బుడ్డాళ్లు ఎవరూ రాటల్లా అసలు ఆళ్లని బుడ్డాడా! అని పిలవనే కూడదంట. పేర్లు పెట్టే పిలవాలంట. మాల పిల్లలందరూ బడులకెళ్లడం మొదలెట్టాక మనకి గొడ్డు కాసేవాళ్లే వుండటల్లా. ఎవడో ఒకడో అరా వుంటన్నారు. పెద్దాళ్లని పెట్టుకుంటే అంతంత డబ్బు ఇచ్చుకోలేమని చిన్నాళ్ల కోసం పాకులాడుతన్నాం. ఆ మధ్య ఎంకయ్య మనవడు వుండాడని ఎవరో చెప్తే పిలిపించి అడిగా ఏవన్నాడో తెలుసా! ముప్పయి బస్తాల వడ్లు, రెండు పూటలా భోజనం పెట్టి సాయంత్రానికల్లా ఇంటికి పంపాలంట. అంట్లుతోమడంట, పాచి ఊడవడంట. ఆడు చేసేదల్లా గొడ్లని మల్లేయడం, కుడితి పెట్టడం. దాని కోసం ఈ ఒత్తులన్నీ ఒత్తాలంట.

సావనీయి! అని ఒప్పుకున్నా!!

ఈలోగా ఆడి బాబొబ్బి నేను మావాడ్ని బళ్లో ఏస్తానని తీసుకుపోయాడు."

"అబ్బ ఆపరా బాబూ! ఎంత సేపు నీ గోల నీదే అవతలాళ్ల గురించి మీరేం ఆలోచించరా! మన ముత్తాతలు ఏం చేసేవారు ? మొక్క జొన్నన్నం తిని మట్టి పిసుక్కునే వాళ్లు. మన తాతలు నాగళ్లు పట్టి పొలాలు దున్నితే, నాన్నల హయాంలో ట్రాక్టర్లతో వ్యవసాయం చేస్తున్నారు. ఆ పొలాల మీది డబ్బుతో వ్యాపారాలు చేసి తేరగా సంపాదిస్తన్నాం. మనం తరతరానికీ మారుతూ వస్తున్నాం. మరి ఆళ్లు ... ఆళ్ల ముత్తాత, తాత, నాన్న అంతా కూలాళ్లుగానే బతికారు కానీ నాలుగెకరాల ఆసామీ అయ్యాడా ఎవరన్నా! మనం ఒక పక్క ఎదుగుతూ వుంటే ఆళ్లు మాత్రం సేవ చేస్తానే వుండాలనడం ఈ జనరేషన్‌లో పుట్టిన నువ్వు అనదగ్గ మాటకాదు" అని గడ్డి పెట్టాను.

"సర్లే మనకెందుకు పోట్లాట! పద ఇంటికెల్దాం అమ్మ అన్నానికి రమ్మందం"టూ తీసుకుపోయాడు. పెద్దమ్మ ఇద్దరికీ పళ్లాలు పెట్టింది. అత్తయ్య ఆరు బయట మంచం మీద కూర్చునే మాతో కబుర్లాడతాంది.

## ఇంగ్లీషు సినిమాలే ఎక్కువ చూస్తాను



పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి చక్కటి నటిగా పేరు తెచ్చుకోవడమే కాకుండా మంచి చిత్రాలను నిర్మించి అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు జయసుధ. ఇటీవల ఓ సందర్భంలో ఆమె మాట్లాడుతూ "నాన్న గారికి ఇంగ్లీషు చిత్రాలంటే బాగా ఇష్టం. ఆయన సినిమాకి వెళ్ళినప్పుడల్లా చిన్నప్పటి నుంచి మమ్మల్ని కూడా వెంట పెట్టుకుని తీసుకెళ్ళేవారు. దాంతో నాకు కూడా ఇంగ్లీషు చిత్రాలు చూడటం అలవాటయ్యింది. ఇక అప్పటి నుంచి నేటికీ ఎక్కువగా చూసే చిత్రాలు ఇంగ్లీషు చిత్రాలే. తెలుగు సినిమా ఏదయినా చాలా బాగుంది అంటేనే వెళ్తుంటాను" అన్నారు.

– కొండేటి మణిమహేశ్వరి

"ఒరేయ్ బాబూ! మీ పద్దయ్య పెదనాన్న గోలేంటో ఇన్నారా" అంది. మా అత్తయ్య వయస్సు అరవై పై మాటే అచ్చం మా పద్దయ్య పెదనాన్నకి చీరగడితే ఎట్టా వుంటుందో ఆట్టాగే వుంటుంది.

"ఇందాక మాటల్లో పడి అడగడం మర్చిపోయా ఏంట్రా గొడవ" అన్నాను

"ఏం లేదు పద్దయ్య పెదనాన్న మన తాత పేరున మా లపల్లిలో జెండా అరుగు కట్టిద్దామనుకున్నాడు. అదే సంగతి అక్కడ చెప్పాడు. ఊళ్లో వున్న ముసలాళ్లు ఏం అనలేదు గానీ, ధర్మయ్య లేడూ, ఆడు మాత్రం తైతక్కలాడడం మొదలెట్టాడు."

"అదే మనం చిన్నప్పుడు ధర్మిగాడని పిలిచేవాళ్లమే • అతనా మన వయస్సే వుంటుంది కదూ" అన్నాను.

"సర్లే ఇప్పుడు 'ధర్మిగాడు' అని పిలిస్తే ఏవన్నా వుందా? 'ఆ! ఆడే!! ధర్మయ్య' ససేమిరా వల్లగాదని ఒకవేళ జెండా అరుగు గనక కట్టిస్తే తనే పలుగుతో పగల కొట్టి పడేస్తానన్నాడంట. ఆ సంగతి తెలిసి పెదనాన్న బాధపడతన్నాడు."

ఈలోగా అత్తయ్య అందుకుంది- "ఏంటి బాధ పడేది. మా నాన్న అదే పెద్ద తాత సంగతి మీకు తెలీదూ తొంభయ్యేళ్లు నిండాక మంచాన బడ్డాడు. మీకు ఊహ వచ్చింతర్వాతే చచ్చిపోయాడు. ఆయన అసలు మాలాళ్లని దగ్గిరికి రానిచ్చే వాడా! అట్టాంటిది ఆయన పేరు మీద మా లపిల్లిలో జెండా అరుగు కట్టిస్తాడంటా మీ పెద్దబ్బ! బాగానే వుంది సంబడం" అంటా మూతి తిప్పింది. మర్నాడు ఇంకా పూర్తిగా తెల్లారలేదు నోట్లో వేప పుల్ల నములుతూ పద్దయ్య పెదనాన్న అటూ ఇటూ తిరుగుతున్నాడు. రోడ్డు మీద ఎళ్లే ఇద్దర్ని కేకేశాడు.

"ఒరేయ్ ధర్మయ్య 'ఆడే మీ నాయకుడు' ఆడ్ని నేను రమ్మన్నానని చెప్పండ్రా" అంటా అరిశాడు. కాసేపటికి ధర్మయ్య రానే వచ్చాడు.

"ఏరా జెండా ఎగరేయడానికి ఫ్లాట్ ఫారం కట్టిస్తానంటే పగలగొడ్డానన్నావంట అడిగాడు.

"అది కాదు పద్దయ్యగారూ! జెండా అరుగు కట్టిస్తే బాదలేదు కానీ మీరు ఆ ముసలాయన పేర్న కట్టిస్తే మాత్రం పగలగొడ్డేది ఖాయం" అన్నాడు మర్యాదగానే.

"ఏం దొబ్బిడాయా" అన్నాడు పెదనాన్న కోపంగా!

"మీరడుగుతున్నారు గాబట్టి చెప్తున్నా! ఇది నా చిన్నప్పుడు జరిగిన సంగతే అయినా నేను ఇప్పటికీ మర్చిపోలా"

"గుర్తుందా నా చిన్నప్పుడు మీ ఇంటో బుడ్డాడిగా వుండేవాడ్ని ఆవాళ గొడ్ల కోసం తవుడు అయిపోతే అయిదు మైళ్లు ఎర్రటి ఎండలో ఎల్లి తెచ్చా. ఇంటికొచ్చేదలికి బాగా గొంతెండిపోయింది. నీళ్లు అడుగుదామంటే మంటెత్తే ఎండలకి అంతా ఇంట్లో తలుపులేసుకుని పడుకున్నారు. లేపడం ఎందుకులే అని మీ నూతిలో గుక్కెడు నీళ్లు తాగుదామని నూతిలో నుంచి తోడుకున్నా సరిగ్గా దోసిడు నీళ్ళు తీసుకుందామనుకున్నానో లేదో! ఆ ముసలాయన వచ్చిపడ్డాడు. బక్కెటుని ఒక్క తన్ను తన్నేశాడు. ఆ చాంతాడుతో బాదాడు. కొట్టినందుకు బాదపడ్లా! కానీ గుక్కెడు నీళ్లన్నా తాగనివ్వలా అందుకు మాత్రం ఏడిశా. ఆ గొంతుతడి ఆరిపోయి కంట్లో చిమ్మింది. ఇప్పుడిప్పుడే ఆ తడి ఆరతాంది. అట్టాంటిది మీరు ఇప్పుడు మళ్లీ ఆ ముసలాయన పేర్న జెండా అరుగు కట్టిస్తామంటన్నారు. పాతయ్యన్నీ మర్చిపోవాలని నేనుకుంటాంటే మీరు మళ్లీ గుర్తు చేస్తానంటే నేను ఊరుకుంటానా" ఆ గొంతు చాలా కచ్చితంగా వుంది. ఎంత కచ్చితంగా నంటే ఆళ్ల నాన్న పేర్న జెండా అరుగు కట్టించే ఆలోచన మళ్లీ మా పెదనాన్న ఎప్పుడూ చేయనంత. ◎

# మానసిక అవరోధాలను అధిగమించాలి

క్రికెట్ మ్యాచ్ ముగించుకుని ఇంటికొచ్చాడు నగేష్. ఇంటర్మీడియెట్ చదువుతున్న నగేష్ తన ప్రిపరేషన్ హాలిడేస్‌లో చదువుకోకుండా క్రికెట్ ఆడటం తల్లిదండ్రులకు కోపం తెప్పించింది. తిట్టారు. బెదిరించారు. అయినా నగేష్ బెదరలేదు.

"పరీక్షలకు ఇక మూడురోజులు మాత్రమే ఉందని నాకు తెలుసు. దయచేసి నన్ను చదవమని ఒత్తిడి చేయకండి. నాకు 70శాతం మార్కులు ఎప్పుడూ వస్తూనే వున్నాయి. అంతకన్నా తక్కువ వచ్చినప్పుడు అడగండి" అంటూ తల్లిదండ్రులకు జవాబిచ్చాడు నగేష్. తల్లిదండ్రులు అతని మాట విన్నారు.



డాక్టర్ పి.టి.సుందరం
న్యూరో సైకాలజిస్టు

గత మూడేళ్లుగా అతను తన 70శాతం మార్కులను మెయింటైన్ చేస్తున్నాడు మరి. కానీ ఉన్నట్టుండి అతని మార్కుల శాతం పడిపోవడం తల్లిదండ్రులకు అనుభవమైంది. ఇంటర్మీడియెట్‌లో నగేష్ ఫెయిల్ అయ్యాడు. అతనికి ఆత్మవిశ్వాసం పోయింది. తన స్నేహితుల నుంచి దూరమయ్యాడు. ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ పెరిగింది. గతంలోలా ఇప్పుడు క్రికెట్ మేచ్‌లలో పాల్గొనటం లేదు. అతని ఆత్మవిశ్వాసం అతన్నలా దెబ్బతీసింది. కేవలం తన తెలివి తేటలనే ఎక్కువగా నమ్ముకున్న అతను డిప్రెషన్‌లో పడిపోయాడు.

నా పరిశీలనలో అడాలిసెంట్ దశ (తెలిసీతెలియని వయసు) పిల్లలున్న తల్లిదండ్రులకు ఈ కింది వాటిలో అనువంశికత లక్షణం తాలూకు ఏదో ఒకదశ అనుభవంలోకి వచ్చేవుంటుంది.

1. డ్రింకర్స్ ఫామిలీ సిండ్రోమ్ (మద్యపాన కుటుంబ అనువంశికత)

2. వాండర్స్ ఫామిలీ సిండ్రోమ్ (తిరుగుబోతు కుటుంబ అనువంశికత)

3. రన్నర్స్ ఫామిలీ సిండ్రోమ్ (అనాలోచిత కుటుంబ అనువంశికత)

4. లవర్స్ ఫామిలీ సిండ్రోమ్ ( ప్రేమికుల కుటుంబ అనువంశికత)

డ్రింకర్స్ ఫామిలీ సిండ్రోమ్: ఇలాంటి కుటుంబాల్లోని తల్లిదండ్రులు తాము చెప్పిందే కరెక్ట్ అనుకునే మనస్తత్వంతో ఉంటారు. తామే కరెక్ట్. ఇతరులు తప్పు అనే భావన ఎక్కువగా ఉంటుంది. రాత్రి బాగా తాగివచ్చిన తండ్రి పొద్దునే కొడుక్కి ఎందుకు తాగకూడదో? అన్న అంశం మీద లెక్చర్ ఇచ్చినట్టు ఉంటుంది ఇలాంటి వారి ప్రవర్తన. కుటుంబసభ్యులు అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఒక స్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసర్ ఇంటిలోనూ 'గర్జించడం'లా అన్నమాట. జీవితంలో తల్లి, తండ్రి, సోదరుడు, ఇలా రకరకాల పాత్రలను పోషించాల్సి వుంటుంది అన్న అవగాహన వీరికి ఉండదు. ఇలాంటి లక్షణాలున్న యుక్తవయసు పిల్లలకు ఎన్.ఎల్.పి.చికిత్సలో యాభైశాతం వరకు మెరుగుపరచవచ్చు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా నూరుశాతం ఫలితం రాబట్టవచ్చు. ఇలాంటి లక్షణాలున్న యుక్తవయసు పిల్లలు హైక్లాస్ సొసైటీలో ఎక్కువగానే కనిపిస్తారు. గత వారం చెప్పిన రోషన్ ఉదాహరణ ఇలాంటిదే. తమకు తోచిందే కరెక్టు అనుకోవడం. తల్లిదండ్రులకు మితిమీరిన ఆత్మవిశ్వాసం ఉండటం, తాము ప్రత్యేకం అనుకునే లక్షణం ఇలాంటి అవలక్షణాన్ని పిల్లల్లో కలిగిస్తుంటుంది.

వాండరర్స్ ఫామిలీ సిండ్రోమ్ : తల్లిదండ్రులు పిల్లలకు కావల్సినవన్నీ ఇస్తుంటారు. అంతవరకే. కానీ వారిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను కలిగించలేరు. తాము వారికి కావల్సింది ఇవ్వడం చేస్తే చాలు అనుకుంటారు. ఇలాంటి ఇంటిలోని యుక్తవయసు పిల్లవాడి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ద్వారా కొంత మార్పు సాధించవచ్చు. రాజు ఉదాహరణ ఈ కోవకు చెందిందే. ఇలాంటివారు తమ ఆలోచనలోకి ఏది వస్తే అది చేస్తూవుంటారు. కానీ ఇలాంటి వారిలో గణనీయమైన మార్పును ఎన్.ఎల్.పి ద్వారా సాధించవచ్చు. తనకు బలహీనతగా మారిపోయిన హస్తప్రయోగం నుంచి బయటపడి చదువులో ఎలా రాణించేలా అయ్యాడో రాజు విషయంలో చెప్పడం జరిగింది.

రన్నర్స్ ఫామిలీ సిండ్రోమ్: ఈ సిండ్రోమ్ వున్న అడాలిసెంట్ కుర్రాడు పిచ్చిపట్టినట్టు డ్రైవ్ చేసే రేసింగ్ కారు డ్రైవర్‌లాంటివాడు. వేగం తప్ప టెక్నిక్ గురించి ఆలోచన ఉండదు. తన లక్ష్యాన్ని సాధించేక్రమంలో ఇతరులను దెబ్బతీయడానికి కూడా జంకడు. గతంలో ఏది కరెక్ట్‌గా ఉందో ఇప్పుడూ అదే కరెక్ట్ అనుకునే మనస్తత్వం ఉంటుంది. భవిష్యత్తులో అదే పనిచేస్తుందన్నది వీరి వాదన. తప్పుడు అంచనాలతో కారు డ్రైవర్ యాక్సిడెంట్‌కు గురయినట్టే, ఇలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ళు మెంటల్‌గా డిప్రెషన్‌లో పడేందుకు అవకాశం ఎక్కువ.

లవర్స్ ఫామిలీ సిండ్రోమ్: తల్లిదండ్రులకు, పిల్లలకు తమ అభివృద్ధి పట్ల ఒకేరకమైన శ్రద్ధ ఉంటుంది. వృత్తిపరమైన గైడెన్స్, సహాయం పొందుతుంటారు. ఇటీవలే ఒక తండ్రి తన పిల్లవాడి స్పెల్లింగ్ ప్రాబ్లెమ్ విషయంలో నా దగ్గరకు వచ్చాడు. ఎన్.ఎల్.పి.ట్రీట్‌మెంట్ ద్వారా అతని సమస్యను పరిష్కరించడం జరిగింది. నూటికి నూరుశాతం పిల్లవాడు మారిపోయాడు.

ఒక సమాజం గణనీయమైన రీతిలో అభివృద్ధి చెందాలంటే లవర్స్ ఫామిలీ సిండ్రోమ్ ఉన్న కుటుంబాల సంఖ్య ఎంత ఎక్కువగా పెరిగితే అంత అవకాశం ఉంటుందన్నమాట. టీచర్లు, సమాచారవ్యవస్థ అమాయకంగా, తెలీనితనంతో సతమతమయ్యే కుటుంబాలకు ఇలాంటి విషయాల్లో అవగాహన కలిగించాలి. ఆ అవసరం ఎంతో ఉంది. ప్రపంచంలో అత్యంత నైపుణ్యవంతమైన మానవవనరుల విషయంలో మన దేశం మూడోస్థానంలో ఉంది. జపాన్, అమెరికాల తర్వాతనన్నమాట. 'సైకలాజికల్ ట్రాప్స్' నుంచి పసితనంలోనే పిల్లలను బయటపడేయగలిగితే మనదేశం మరింత గొప్పగా తయారవుతుందన్నమాట. కాదంటారా?!